సాక్షి
తూర్పుగోదావరి
సోమవారం, 14, ఆగస్టు, 2023



శిల్పాలకు రూ.లక్ష విరాళం

అమలాపురం టౌన్: స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శిల్పాల నిర్మాణానికి పెద్దిరెడ్డి దొరబాబు (అమలాపురం రూరల్ మండలం నవర ప్పాలెం) రూ.లక్ష విరాళం సమర్పించారు.



రూ.1,00,116 విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి కోడి వెంకట రాయల్, హేమ వెంకటలక్ష్మి దంపతులు (రాజోలు మండలం బి.సావరం) ఆదివారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.

దుర్గమ్మకు బంగారు మంగళ సూత్రాలు



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్ర కీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మకు డి.రామ్‌ప్రసాద రావు, లలిత దంపతులు (కాకినాడ) ఆదివారం సుమారు 20 గ్రాముల బంగారు మంగళ సూత్రాలు సమర్పించారు.

న్యూస్‌రీల్

కోటసత్తెమ్మ వారికి ప్రత్యేక పూజలు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. ప్రధానార్చకుడు అప్పారావుశర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా అమ్మవారికి రూ.1,85,842 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) తెలిపారు.

రూ.లక్ష విరాళం



దాత చలపతిరావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీను

ద్వారకా తిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు కేశిరాజు వెంకట చలపతిరావు (రాజమహేంద్రవరం) తన కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.

క్రికెట్ క్రీడాకారుల 3కే రన్



3కే రన్ నిర్వహిస్తున్న క్రికెట్ క్రీడాకారులు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): ఈ నెల 16 నుంచి 27వ తేదీ వరకూ విశాఖపట్నంలో జరగనున్న ఏపీఎల్ సీజన్–2 క్రికెట్ పోటీలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ క్రికెట్ క్రీడాకారులు ఆదివారం 3కే రన్ నిర్వహించారు. నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి లాలాచెరువు వరకూ ఈ రన్ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా క్రికెట్ అసోసియేషన్ రాజమహేంద్రవరం సబ్ సెంటర్ కోచ్ జీరి హరనాథరెడ్డి మాట్లాడుతూ, ఏపీఎల్ సీజన్–1 విజయవంతం కావడంతో అధిక సంఖ్యలో క్రికెట్ క్రీడాకారులకు ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)లో ఆడేందుకు అవకాశాలు వచ్చాయని అన్నారు. ఈ సీజన్‌లో మరింత మంది క్రీడాకారులకు ఐపీఎల్‌లో పాల్గొనే అవకాశాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

కడలిలోకి 1.05 లక్షల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 1,05,217 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. డెల్టా కాలువలకు 15 వేల క్యూసెక్కులు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 4,900, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 7,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. గోదావరి నీటిమట్టం బ్యారేజీ వద్ద 10.20 అడుగులు, భద్రాచలం వద్ద 14.70 అడుగులుగా నమోదైంది.

ముగిసిన ఈశా ట్రోఫీ క్రీడా పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఈశా ప్రతినిధులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్రీడా మైదానంలో గ్రామోత్సవం పేరిట రెండు రోజులు జరిగిన ఈశా రెజువనేషన్ ట్రోఫీ 2023 క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. ఈషా యోగా కేంద్రం ఆధ్వర్యాన దక్షిణ భారతదేశంలో నిర్వహిస్తున్న ఈ పోటీలు జిల్లాలో నన్నయ వర్సిటీ క్రీడా ప్రాంగణంలో జరిగాయి. పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. వాలీబాల్ పోటీల్లో మొదటి బహుమతి రూ.9 వేలు, రెండో బహుమతి రూ.6 వేలు, మూడో బహుమతి రూ.3 వేలు, నాలుగో బహుమతి రూ.2,500 అందజేశారు. త్రోబాల్‌లో వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1,500 చొప్పున ఇచ్చారు. ఈ పోటీల ఫైనల్స్ వచ్చే నెల 23న కోయంబత్తూరులో జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. వీటిలో విజేతలకు మొదటి బహుమతిగా వాలీబాల్‌లో రూ.5 లక్షలు, త్రోబాల్‌లో రూ.2 లక్షల చొప్పున, 200 వరకూ రూ.55 లక్షలకు పైబడి నగదు బహుమతులు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో ఈశా ఫౌండేషన్ సభ్యులు, వర్సిటీ క్రీడా విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఝుమ్మంది నాదం

సన్నాయి వాయిస్తున్న కళాకారిణి



- సన్నాయి మేళంలో రాణిస్తున్న మహిళలు
- ఏడిదలో పది మందికి పైగా కళాకారిణులు
- రాష్ట్ర స్థాయిలో గ్రామానికి గుర్తింపు
- పలు రాష్ట్రాల్లో ప్రదర్శనలు

మండపేట: హిందూ సంప్రదాయంలో డోలు, సన్నాయి మంగళకరమైన వాయిద్యాలు. శుభకార్యాలు, వేడుకలకు సన్నాయి మేళం తప్పనిసరి. నాదస్వరం పేరు చెప్పగానే పురుష కళాకారులే గుర్తుకు వస్తారు. అందుకు భిన్నంగా మగవారికి దీటుగా డోలు, సన్నాయిని వినసొంపుగా వాయిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన మహిళా కళాకారులు. ఒకరూ ఇద్దరూ కాదు.. ఈ గ్రామంలో ఏకంగా పది మందికి పైగా మహిళా కళాకారులుండగా.. వీరందరూ ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం విశేషం.

ఏడిదలోని వెంటూరి సాహెబ్ కుటుంబం డోలు, సన్నాయి వాయిద్యానికి ప్రసిద్ధి. తమ ఇంట ఈ కళకు 80 ఏళ్ల క్రితం ఆయనే ఆజ్యం పోశారు. సాహెబ్ తదనంతరం ఆయన కుమారులు, మనవలు, ముని మనవలు ఇదే వృత్తిలో కొనసాగుతున్నారు. తిరుపతి బ్రహ్మోత్సవాలు, రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ నాయకులు, సినీతారలు, ప్రముఖుల ఇళ్లలో జరిగే వేడుకల్లో ప్రదర్శనలు ఇచ్చి గ్రామానికి గుర్తింపు తెచ్చారు. ఎంతోమంది కళాభిమానులు వీరి నైపుణ్యానికి మెచ్చి గండపెండేరాలు, సింహతలాటాలు, బంగారు కడియాలతో సత్కరించారు. గత ఐదు తరాల్లో 25 మందికి పైగా సాహెబ్ కుటుంబీకులు నాదస్వర కళను నేర్చుకున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రస్తుత తరంలో మేము సైతం అంటూ ఆ ఇంట మహిళలు వాయిద్య కళలో రాణిస్తున్నారు.

ప్రత్యేక ఆకర్షణ

సన్నాయి మేళంలో వాయిద్య పరికరాలు డోలు, సన్నాయి, చిన్న హార్మోనియం (శ్రుతి బాక్స్), తాళం ఉంటాయి. ఆరుగురి నుంచి ఎనిమిది మంది వరకూ సభ్యులుంటారు. సాధారణంగా పురుష కళాకారులే ఆయా వాయిద్యాలను వాయిస్తుంటారు. అయితే ఏడిద సన్నాయి మేళంలో మహిళా వాయిద్య



సన్నాయి మేళంలో మహిళా కళాకారులు

కళాకారులు ప్రత్యేక ఆకర్షణ. గ్రామంలోని సాహెబ్ కుటుంబానికి చెందిన మూడు సన్నాయి మేళం బృందాలుండగా.. వీటిలో పది మందికి పైగా మహిళా కళాకారులే ఉండటం గమనార్హం. సాహెబ్, తర్వాత ఆయన తనయులు, మనవలు ఎంతో మందికి డోలు, సన్నాయి వాయించడంలో శిక్షణ ఇస్తున్నారు. వారితో పాటు తమ ఇంట్లోని ఆడపిల్లలకు కూడా నేర్పిస్తుంటారు. ఈ క్రమంలో తమ కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో సన్నాయి మేళంలో మహిళలు కూడా భాగస్వాములయ్యారు. మగవారితో సమానంగా డోలు, సన్నాయి అలవోకగా వాయిస్తూ వివిధ వేడుకలకు మరింత శోభను తీసుకువస్తున్నారు. కుటుంబ పోషణలో చేదోడువాదోడవుతున్నారు.

అంతా ఒకటే కుటుంబం

ఎక్కడ ప్రదర్శన ఉంటే అక్కడకు బృందంలోని తమ కుటుంబ సభ్యులతో కలిసి వీరు వెళ్తుంటారు. గత పదేళ్లలో ఉభయ రాష్ట్రాలతో పాటు రాజాస్థాన్‌లో వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల్లో జరిగిన వివాహాది శుభకార్యాల్లో వందలాది ప్రదర్శనలు ఇచ్చారు. మండపేట, పరిసర ప్రాంతాల్లో ఎక్కడ వేడుక జరిగినా మహిళలతో డోలు, సన్నాయి మేళం ఏర్పాటు చేయడం పరిపాటిగా మారింది. దీంతో మహిళా వాయిద్య కళాకారుల ప్రాధాన్యం పెరిగింది. చదువుతో పాటు తమ ఇంట ఆడపిల్లలకు వాయిద్య కళలో శిక్షణ ఇస్తుంటామని కళాకారుడు వెంటూరి మీరా సాహెబ్ (చిన్న) తెలిపారు.



డోలు వాయిస్తున్న కళాకారిణి

సరదాగా చేసిన సాధనే ఉపాధి అయ్యింది



నా చిన్నతనంలో ఏడిదలో మా తండ్రి సత్యనారాయణ చాలా మంది పిల్లలకు శిక్షణ ఇచ్చేవారు. వారితో పాటు నేనూ సరదాగా సన్నాయి వాయిద్యం నేర్చుకున్నాను. ఇప్పుడు ఆ విద్యే మాకు మంచి గుర్తింపు తెచ్చింది. కుటుంబ పోషణకు ఆసరా అవుతోంది.

– డి.సీతారత్నం, వాయిద్య కళాకారిణి, మండపేట

ఎంతో గౌరవంగా చూస్తారు



తెలుగు రాష్ట్రాలతో పాటు గుజరాత్, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో జరిగిన బ్రహ్మోత్సవాలు, శుభకార్యాల్లోను, సినిమా హీరోలు, రాజకీయ నాయకులకు సంబంధించిన వివిధ వేడుకల్లోను ఎన్నో ప్రదర్శనలు ఇచ్చాం. ఆయా చోట్ల నిర్వాహకులు మమ్మల్ని ఎంతో గౌరవంగా చూస్తుంటారు.

– వెంటూరి రమాదేవి, వాయిద్య కళాకారిణి, ఏడిద

గ్రామానికి గుర్తింపు తెచ్చారు



డోలు, సన్నాయి కళలో వెంటూరి సాహెబ్ కుటుంబం రాష్ట్ర స్థాయిలో మా గ్రామానికి మంచి గుర్తింపు తెచ్చారు. ప్రత్యేకంగా పురుషులతో సమానంగా మహిళలు ఈ కళను నేర్చుకుని కుటుంబ పోషణలో భాగస్వాములు కావడం అభినందనీయం.

– బూరిగ ఆశీర్వాదం,సర్పంచ్, ఏడిద

రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు



కొంతమూరు అప్పన్న చెరువు వద్ద అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న షర్మిలారెడ్డి, నాగేశ్వర్

- రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి
- రూరల్‌లో రూ.1.36 కోట్లతో వివిధ పనులకు శంకుస్థాపన

రాజమహేంద్రవరం రూరల్/ధవళేశ్వరం: రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) పరిధిలో రూ.40 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామని చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి తెలిపారు. ధవళేశ్వరం, హుకుంపేట డి–బ్లాక్, కొంతమూరు గ్రామాల్లో రుడా ఆధ్వర్యాన రూ.1.36 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఆమె శ్రీకారం చుట్టారు. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అధ్యక్షతన ఈ కార్యక్రమాలు జరిగాయి. ధవళేశ్వరం ఇండస్ట్రియల్ కాలనీ పార్కులో ప్రహరీ, ఓపెన్ జిమ్; హుకుంపేట డి–బ్లాక్‌లో ప్రహరీ, వాకింగ్ ట్రాక్, పచ్చదనం అభివృద్ధి; కొంతమూరు అప్పన చెరువు వద్ద ప్రహరీ, వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి షర్మిలారెడ్డి, నాగేశ్వర్ కొబ్బరి కాయలు కొట్టి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షర్మిలారెడ్డి మాట్లాడుతూ, ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల కో ఆర్డినేటర్ల సూచనలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. ముఖ్యంగా ప్రజల ఆరోగ్యం కోసం పార్కులు అభివృద్ధి చేస్తున్నామని, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. చందన నాగేశ్వర్ సూచనల మేరకు రూరల్ నియోజకవర్గంలో మొదటి విడతగా రూ.1.36 కోట్లతో ఈ పనులు చేపట్టామని, రెండో విడతలో మరింత అభివృద్ధి చేస్తామని షర్మిలారెడ్డి చెప్పారు. రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానన్నారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా అమలవుతున్నాయని చెప్పారు. అడిగిన వెంటనే రూ.1.36 కోట్లు మంజూరు చేసిన రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రుడా వైస్ చైర్మన్ బి.బాలస్వామి, కార్యదర్శి శైలజవల్లి, ఈఈ టి.చంద్రశేఖరరావు, పంచాయతీ కార్యదర్శులు సూరిబాబు, జి.వెంకటరావు, విజయారెడ్డి పాల్గొన్నారు.

కానుకలు అడిగితే కఠిన చర్యలే..

- నిబంధనలు పాటించాల్సిందే..
- అన్నవరం వ్రత పురోహితులకు ఈఓ ఆదేశం



దేవస్థానంలో వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో వ్రతాలాచరించే భక్తులను వ్రత పురోహితులు కానుకలు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని అన్నవరం దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక సర్క్యులర్ విడుదల చేశారు. వ్రతం పూర్తయ్యాక కానుకలు డిమాండ్ చేసినట్టు భక్తులు ఫిర్యాదు చేయడంతో రెండు వారాల వ్యవధిలోనే ఇద్దరు వ్రత పురోహితులను ఈఓ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వ్రత పురోహిత సూపర్‌వైజర్లతో సమావేశమై, పలు నిర్ణయాలు తీసుకున్నట్టు ఆయన తెలిపారు.

- వ్రత మండపాల్లో ప్రస్తుతం ఉన్న సీసీ కెమేరాలకు తోడుగా రెండువైపులా వాయిస్ రికార్డర్లు కూడా ఏర్పాటు చేయాలి. పురోహితులు కానుకలు డిమాండ్ చేసినట్టు ఫిర్యాదులు వచ్చిన వెంటనే వాయిస్ రికార్డర్ పరిశీలించి, ఫిర్యాదు వాస్తవమేనని తేలితే వెంటనే సస్పెండ్ చేస్తారు. ఎక్కువ సార్లు సస్పెండ్ అయినా తీరు మారని పురోహితులను విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తారు.
- వ్రత మండపాల్లో పని చేసే సిబ్బంది ఆకుపచ్చ రంగు చొక్కా, తెలుపు, పసుపు, చందనం రంగు పంచె ధరించాలి.
- వ్రత కథ చెప్పే పురోహితులు ఒకేచోట కాకుండా అన్ని మండపాల్లో చెప్పేలా రొటేషన్ పద్ధతి ఏర్పాటు చేయాలి.
- వ్రతాల టిక్కెట్టులో 40 శాతం ఆదాయం వ్రత పురోహితులకు చెల్లిస్తున్నట్టు అన్ని వ్రత మండపాల్లోనూ పెద్ద అక్షరాలతో బోర్డులు ఏర్పాటు చేయాలి.
- సత్యదేవుని క్షేత్ర మహిమ గురించి భక్తులకు మూడు నిమిషాల పాటు వివరించాలి.
- దేవస్థానంలో నిర్వహించే అన్నదానం, గోసేవ, తులాభారం, చండీహోమం, ఆయుష్య హోమం తదితర సేవలు, దేవస్థానం నిర్వహిస్తున్న విద్యా సంస్థలు, ఇతర సేవల గురించి వ్రతాలాచరించే భక్తులకు వివరించి, వారి నుంచి విరాళాలు సేకరించాలి.
- భక్తులు చూస్తుండగా పురోహితులు ఫలహారాలు తినరాదు. వారికి కేటాయించిన విశ్రాంతి మండపంలో మాత్రమే తినాలి.
- పురోహితులు గుంపులుగా ఉంటూ సెల్‌ఫోన్‌లో ఆటలు ఆడటం, సినిమాలు, వీడియోలు వీక్షించడం వంటివి చేయరాదు. ఫోన్లు కూడా తమ విశ్రాంతి మండపంలో డిపాజిట్ చేయాలి.
- ఈ నిబంధనలన్నింటినీ పురోహితులు పాటించేలా వ్రతాల విభాగం సూపరింటెండెంట్, వ్రతాల సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలి. లేకుంటే కఠిన చర్యలు తప్పవు.

టమాటా.. కాస్త ఊరట

- సామాన్యులకు అందుబాటులో ధర
- కిలో రూ.50 నుంచి రూ.60కే లభ్యం
- పెరిగిన విక్రయాలు



రాజమహేంద్రవరం రూరల్: అధిక ధరలతో వినియోగదారులకు చుక్కలు చూపించిన టమాటా ధర.. ప్రస్తుతం సామాన్యులకు అందుబాటులోకి వస్తోంది. రెండు నెలలుగా కిలో టమాటా ధర మూడంకెల పైనే కొనసాగింది. క్రమేపీ రూ.130 నుంచి పెరుగుతూ రూ.180 వరకూ ఎగబాకి, వినియోగదారుల గుండెల్లో గుబులు పుట్టించింది. అంత ధరకు కొనలేక చాలామంది టమాటా వినియోగమే మానుకున్నారు. ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకున్న రాష్ట్ర ప్రభుత్వం భారీ సబ్సిడీతో జిల్లాలోని తొమ్మిది రైతుబజార్ల ద్వారా 55 టన్నుల టమాటాను కిలో రూ.50కే అందించింది. దడ పుట్టించిన టమాటా ధరలు క్రమేపీ తగ్గుతూ ప్రస్తుతం రెండంకెలకు రావడంతో విక్రయాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం రైతుబజార్లలో రూ.50, బయటి మార్కెట్‌లో రూ.60కి విక్రయిస్తున్నారు. ఈ ధరలు మరింత దిగి వస్తాయని కూరగాయలు వ్యాపారులు చెబుతున్నారు.

జిల్లాలోని రాజమహేంద్రవరంతో పాటు పలు ప్రాంతాలకు వ్యాపారులు చిత్తూరు జిల్లా మదనపల్లి, పుంగనూరు నుంచే టమాటాలు దిగుమతి చేసుకుంటారు. చిత్తూరుతో పాటు తెలంగాణలోని రంగారెడ్డి, వికారాబాద్, మెదక్ జిల్లాల్లో టమాటా దిగుబడి కొన్నాళ్లుగా పెరిగింది. దీంతో మార్కెట్‌లో లభ్యత పెరిగి, టమాటా ధరలు తగ్గుతున్నాయని కూరగాయలు వ్యాపారులు చెబుతున్నారు. ధరలు సాధారణంగా ఉన్న రోజుల్లో జిల్లాకు రోజుకు దాదాపు 15 టన్నుల టమాటాలు దిగుమతి అయ్యేవి. కిలో ధర రూ.100 నుంచి రూ.180 వరకూ పలికిన సమయంలో 3 టన్నుల దిగుమతి కూడా గగనంగా ఉండేది. జిల్లాలోని లంక గ్రామాల్లో పండే దేశవాళీ టమాటా ఏటా డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో మాత్రమే లభ్యమవుతుంది. మిగిలిన సమయాల్లో మదనపల్లి, పుంగనూరు మార్కెట్ల నుంచే దిగుమతి చేసుకుంటారు.

10 కిలోలు అమ్మడమే కష్టమయ్యేది



ధరలు సాధారణంగా ఉన్నప్పుడు 50 నుంచి 100 కిలోల టమాటాలు దిగుమతి చేసుకుని, పూర్తిగా విక్రయించేవాళ్లం. అదే ధర అధికంగా పెరిగిన సమయంలో 20 కిలోలు దిగుమతి చేసుకున్నా.. అందులో 10 కిలోలు అమ్మడమే కష్టమయ్యేది. ప్రస్తుతం కిలో టమాటా రూ.60కు విక్రయిస్తున్నాం.

– టీసు సురేష్, కూరగాయల వ్యాపారి, ఆల్కాట్‌తోట, రాజమహేంద్రవరం

మరింత తగ్గుతాయి



టమాటా ధరలు వారం రోజుల్లో మరింతగా తగ్గుతాయి. కిలో రూ.45కు తగ్గే అవకాశం ఉంది. టమాటా ధరలు అధికంగా పెరిగిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మార్కెటింగ్ శాఖ ద్వారా రైతుబజార్లలో కిలో టమాటాను రాయితీపై రూ.50కే వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. జిల్లాలోని తొమ్మిది రైతుబజార్ల ద్వారా 55 టన్నుల టమాటా సరఫరా చేశాం. ప్రస్తుతం ధరలు తగ్గుతున్నందున రైతుబజార్లలో రాయితీపై విక్రయాలు నిలిపివేశాం. టమాటా దిగుమతులు వారం రోజుల్లో మరింత సరళం కానున్నాయి.

– ఎం.సునీల్ వినయ్, జిల్లా మార్కెటింగ్, ట్రేడింగ్ అధికారి

రేపటి వరకూ హర్ ఘర్ తిరంగా



డ్వామా కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసిన పీడీ జగదాంబ

రాజమహేంద్రవరం రూరల్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఆదివారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకూ ప్రతి కార్యాలయం, ఇంటి వద్ద హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.జగదాంబ తెలిపారు. తమ కార్యాలయం ప్రాంగణంలో జాతీయ జెండాను ఆమె ఆదివారం ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 14న స్వాతంత్య్ర సమర వీరులను స్మరిస్తూ దేశం కోసం అత్యున్నత త్యాగం చేసిన వారి కుటుంబ సభ్యులను సత్కరిస్తామన్నారు. 15న రోడ్లకు ఇరువైపులా ఉన్న అంగళ్లకు, చెట్లకు జాతీయ జెండాలు కట్టి, దేశభక్తిని చాటే కార్యక్రమాలకు రూపకల్పన చేశామన్నారు. 16న మండల, పురపాలక, నగరపాలక సంస్థల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ జి.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం స్వాధీనం



కాతేరులో అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం, వ్యాన్, చిత్రంలో నిందితుడు

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు గామన్ బ్రిడ్జి సమీపంలో వ్యాన్‌తో పాటు రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. అందులో 90 సంచుల్లో నాలుగు వేల కిలోల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నుంచి కాకినాడ జిల్లాకు చెందిన అడబాల శివరామ్ (నరేష్)కు పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడుకు చెందిన వ్యాన్ డ్రైవర్ శానా తేజ్ కుమార్ బొజ్జ రామకృష్ణ సహాయంతో తరలిస్తున్నారు. ఈ బియ్యం విలువ రూ.6.60 లక్షలు ఉంటుంది. బియ్యంతో పాటు వ్యాన్‌ను సీజ్ చేసి రూరల్ ఎంఎస్‌వో ప్రభాకర్ 6ఏ కేసు నమోదు చేశారు. వ్యాన్ డ్రైవర్ తేజ్‌కుమార్, సహాయకుడు బొజ్జ రామకృష్ణ, పీడీఎస్ బియ్యం కలిగి ఉన్న అడబాల శివరామ్‌పై క్రిమినల్ కేసులు నమోదుకు పోలీస్ స్టేషన్‌కు సిఫార్సు చేశారు. రీజినల్ విజిలెన్స్ ఇన్‌చార్జి ఎస్పీ కె.కుమార్ మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమ నిల్వలు, రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందన్నారు. ఎవరైనా పీడీఎస్ బియ్యం కొనడం, అమ్మడం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

అన్నవరానికీ ఓ అలిపిరి



తిరుపతిలోని అలిపిరి టోల్‌గేట్ (ఫైల్)



అన్నవరంలోని రత్నగిరి టోల్‌గేట్

- అక్కడి తరహాలో రత్నగిరి టోల్‌గేట్ అభివృద్ధి
- ఆధునిక స్కానర్లతో తనిఖీలకు చర్యలు
- వాహనాల రద్దీ నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు
- ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా సర్వీస్ రోడ్డు

అన్నవరం: రత్నగిరిపై భద్రత కట్టుదిట్టం చేస్తున్నారు.. అవాంఛనీయ ఘటనకు ఆస్కారం లేకుండా చర్యలు చేపడుతున్నారు.. అన్నవరంలోని వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో టోల్‌గేట్‌ను తిరుపతిలోని అలిపిరి టోల్‌గేట్ మాదిరిగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా సుమారు రూ.90 లక్షలతో టోల్‌గేట్ వద్ద 80 అడుగుల వెడల్పు, 150 అడుగుల పొడవున భారీ షెడ్డు నిర్మించనున్నారు. దీని నిర్మాణానికి దేవస్థానం ధర్మకర్తల మండలి ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. త్వరలోనే కమిషనర్ అనుమతి తీసుకుని టెండర్లు పిలవనున్నట్లు దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదివారం 'సాక్షి'కి వెల్లడించారు. ఈ షెడ్డులో ఆధునిక స్కానర్లు ఏర్పాటు చేసి భక్తుల వాహనాలు, లగేజీ పూర్తిగా తనిఖీ చేయనున్నారు.

ఆ రద్దీ ఎందుకంటే..

కరోనా వైరస్ అనంతరం సత్యదేవుని ఆలయానికి వచ్చే భక్తులలో దాదాపు సగం మంది సొంత వాహనాల్లో వస్తున్నారు. సాధారణ రోజుల్లో సుమారు రెండు వేల వాహనాలు, దశమి, ఏకాదశి, పౌర్ణమి వంటి పర్వదినాల్లో ఐదు వేలకు పైబడి వాహనాలు ఉంటున్నాయి. కార్తిక ఏకాదశి, కార్తిక పౌర్ణమి వంటి సత్యదేవుని కల్యాణ మహోత్సవాల రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతోంది.ఈ వాహనాలతో టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దేవస్థానానికి వాహనాల్లో వచ్చే భక్తులు పెరగడంతో టోల్‌గేట్ వద్ద టోల్ వసూలుకు నిర్వహించిన వేలం పాట రెట్టింపు అయ్యింది. రెండేళ్ల కిందట నెలకు రూ.13 లక్షలకు ఈ వేలం పాట వెళ్లింది. గత నెలలో నెలకు రూ.23 లక్షలకు పాడారు. అంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

నిషేధిత వస్తువులు తీసుకెళ్లకుండా..

వాహనాల రద్దీ కారణంగా ఎవరూ పట్టించుకోరనే ఉద్దేశంతో కొంతమంది భక్తుల ముసుగులో గంజాయి వంటి వాటిని కొండపైకి వాహనాల్లో తరలించి అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో దేవస్థానానికి వెళ్లే అన్ని వాహనాలను విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. దేవస్థానం ఈఓగా చంద్రశేఖర్ ఆజాద్ వచ్చాక ఈ తనిఖీలు మరింత కఠినతరం చేశారు. ఆయుధాలు, మందుగుండు సామగ్రి, మద్యం సీసాలు, మాంసం, వంట చెరకు, సిలిండర్లు వంటి వాటిని కూడా రత్నగిరిపైకి అనుమతించడం లేదు. షెడ్డు నిర్మించాక ఆధునిక స్కానర్లతో మరింత పక్కాగా తనిఖీలు చేయనున్నారు.



టోల్‌గేట్ వద్దకు వెళ్లేందుకు కొత్తగా నిర్మించిన సర్వీస్ రోడ్డు

వాహనాలకో సర్వీసు రోడ్డు

టోల్‌గేట్ ద్వారా ప్రయాణించే వాహనాల కోసం మెయిన్ రోడ్డు పక్కనే కళాశాల ప్రహరీని ఆనుకుని ప్రత్యేకంగా సర్వీసు రోడ్డు నిర్మించారు. త్వరలో వాహనాలను టోల్‌గేట్ వద్దకు అనుమతిస్తారు. అక్కడ తనిఖీలు పూర్తయ్యాక వాహనాలకు టోల్ వసూలు చేస్తారు. దీనికోసం హైవే టోల్‌గేట్ల వద్ద ఉండే ఆటోమేటిక్ గేట్లను ఏర్పాటు చేయనున్నారు. బటన్ నొక్కగానే గేటు పైకి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు.

విశ్రాంత షెడ్ల ఏర్పాటు

టోల్‌గేట్ వద్ద గదుల కేటాయించేలా సీఆర్వో ఆఫీసు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇక్కడ 24 గంటలు వసతి గదుల సమాచారంతో పాటు గదుల కోసం ఇక్కడే రశీదు ఇచ్చే ఏర్పాటు చేశారు. అదే విధంగా సీఆర్వో ఆఫీస్ పక్కనే ఉన్న కళాశాల మైదానంలో విశ్రాంత షెడ్లు నిర్మిస్తున్నారు. గదులు దొరకని వారు ఇక్కడే లాకర్లలో తమ లగేజీ భద్రపర్చుకుని స్నానం చేసి స్వామివారి దర్శనానికి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు. టూరిస్ట్ బస్సులలో వచ్చేవారు వంటలు చేసుకునేందుకు వీలుగా ఇక్కడే అన్ని వస్తువులు దొరికేలా ప్రావిజన్ స్టోర్ పెడుతున్నారు.

> **అలిపిరి తరహాలో చెకింగ్**
>
> 
>
> రత్నగిరి టోల్‌గేట్ వద్ద విశాలమైన షెడ్డు నిర్మించి అందులో అలిపిరి తరహాలో చెకింగ్ చేసేందుకు గాను ఆధునిక యంత్రాలతో కూడిన స్కానర్లను ఏర్పాటు చేస్తాం. దీనికోసం రూ.90 లక్షలతో షెడ్డు నిర్మిస్తున్నాం. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశాకే దేవస్థానానికి అనుమతిస్తాం. భక్తుల వసతి గదుల లభ్యత సమాచారం తెలిసేలా టోల్‌గేట్ వద్దనే సీఆర్వో ఆఫీసు ఏర్పాటు చేశాం. విశ్రాంత షెడ్ల నిర్మాణం కూడా త్వరలోనే పూర్తి కానుంది.
>
> –చంద్రశేఖర్ ఆజాద్, ఈఓ, అన్నవరం దేవస్థానం

ఇంజినీరింగ్ విద్యార్థులను ఢీకొన్న కారు

- ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

తాళ్లరేవు: కాకినాడ– యానాం 216 జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. కోరంగి పోలీసుల కథనం ప్రకారం.. తాళ్లరేవు కొత్త అయ్యప్ప స్వామి ఆలయం వద్ద విద్యార్థులు రోడ్డు దాటుతుండగా కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఆ కారు ఆపకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉద్దండపురం గ్రామానికి చెందిన తుమ్మల రవీంద్ర (21) అక్కడికక్కడే మరణించగా, చేబ్రోలుకు చెందిన ఉక్కునూరి శ్రీను తలకు తీవ్ర గాయాలయ్యాయి. మృతి చెందిన విద్యార్థి రాజమహేంద్రవరంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఘటనా స్థలంలో విద్యార్థులను ఢీకొన్న కారు నంబరు బోర్డు విరిగి పడింది. దాని ఆధారంగా ప్రమాదానికి కారకులైన వారిని గుర్తిస్తున్నట్లు ఎస్సై పి.శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



బొట్టా నాగమణి (ఫైల్)

రౌతులపూడి: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందినట్లు రౌతులపూడి ఎస్సై అబ్దుల్ నబీ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఎస్.అగ్రహారం గ్రామానికి చెందిన బొట్టా నాగమణి (32) బంగారయ్యపేటలో తన పుట్టింటికి ద్విచక్ర వాహనంపై వస్తుంది. ఈ నేపథ్యంలో రౌతులపూడి నుంచి తుని వైపు ఎదురుగా మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు రౌతులపూడిలో వాటర్ సర్వీసింగ్ సెంటర్ వద్ద వాహనాన్ని మలుపు తిప్పడంతో ఇరు వాహనదారులు సడన్ బ్రేక్ వేశారు. దీంతో వెనుక కూర్చున్న నాగమణి కింద పడిపోయింది. ఆమె తలకు బలమైన గాయం కావటంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడకు తీసుకెళ్లాలని సూచించారు. అంబులెన్స్‌లో కాకినాడకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు ఎస్సై నబీ వివరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పాములేరు వాగులో మునిగి ఇద్దరి మృతి




మాదాల సుబ్రహ్మణ్యం (ఫైల్)



కలిదిండి తేజవర్మ (ఫైల్)

ముమ్మిడివరం: నగర పంచాయతీ పరిధి చిప్పలపాలెం, క్రాపచింతలపూడి గ్రామాలకు చెందిన ఇద్దరు మారేడుమిల్లి పాములేరు వాగులో మునిగి మృతి చెందారు. దీంతో ఆ గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. ఆయా గ్రామాలకు చెందిన ఏడుగురు స్నేహితులు ఆదివారం ఉదయం మారేడుమిల్లి విహార యాత్రకు వెళ్లారు. అక్కడ పాములేరు వాగులో స్నానానికి దిగిన క్రాపచింతలపూడికి చెందిన మాదాల సుబ్రహ్మణ్యం (45), చిప్పలపాలేనికి చెందిన కలిదిండి తేజవర్మ(33) ప్రమాదవశాత్తూ మునిగి మృతి చెందారు. ఈ వార్త తెలిసిన వెంటనే ఆయా గ్రామాల్లో విషాదం నెలకొంది. సుబ్రహ్మణ్యం ఆటో నడుపుతూ కుటుంబానికి ఆసరా ఉంటున్నాడు. అతనికి భార్య రాధ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తుంది. ఇద్దరు ఆడ పిల్లలను ఎలా పెంచాలంటూ రాధ విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. తేజవర్మ గ్రామ వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. కలిదిండి గోపాలకృష్ణ, అనసూయమ్మ దంపతులకు తేజవర్మ ఒక్కగానొక్క కుమారుడు. చేతికి అందివచ్చిన కొడుకు చనిపోవడంతో ఆ దంపతులు బోరున విలపిస్తున్నారు.

విహార యాత్రలో విషాదం



కాజా హేమంత్ (ఫైల్)

సీతానగరం: సరదాగా విహార యాత్రకు వెళ్లిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ విగతజీవిగా మారాడు. వంగలపూడికి చెందిన కాజా హేమంత్ (24) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. స్నేహితులతో కలసి ఆదివారం చింతూరు వద్దకు విహార యాత్రకు వెళ్లాడు. వాటర్ ఫాల్స్ వద్ద హేమంత్ ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. మృతుడికి తండ్రి కాజా ప్రభాకరరావు, తల్లి సుజాత, సోదరుడు ఉన్నారు. అందివచ్చిన కుమారుడు మరణించడంతో కుటుంబ సభ్యుల రోదన స్థానికులను కంటతడి పెట్టించింది.

మెరుగు పెడతామని మోసగించి..

- బంగారంతో ఉడాయించిన ప్రబుద్ధులు
- మోసగాళ్ల ఆచూకీ తెలిపిన వారికి నజరానా: డీఎస్పీ అంబికా ప్రసాద్

అమలాపురం టౌన్/ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం అనాతవరం గ్రామ ప్రధాన రహదారి సమీపంలో నివసిస్తున్న వృద్ధ దంపతుల ఇంటికి వచ్చిన ఇద్దరు బంగారు నగలకు మెరుగు పెడతామని నమ్మించి, 41 గ్రాముల బంగారంతో ఉడాయించారని అమలాపురం డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ వివరించారు. ఆ నిందితుల ఆచూకీ తెలిపిన వారికి రూ.5 వేల నజరానా అందిస్తామని ప్రకటించారు. బైక్‌పై వచ్చిన ఆ ఇద్దరూ సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యారు. ఈ సీసీ ఫుటేజీ, ఫొటోలను అమలాపురంలో డీఎస్పీ ఆదివారం విడుదల చేశారు. సీసీ ఫుటేజీల్లో వ్యక్తులను గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ వివరాలు అందించిన వారి సమాచారం గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ మోసానికి సంబంధించిన ఆయన తెలిపిన కథనం ప్రకారం.. అనాతవరం ప్రధాన రహదారి పక్కన ఓ ఇంట్లో వృద్ధ దంపతులు సానబోయిన భవానీశంకర్, విజయలక్ష్మిలు నివాసం ఉంటున్నారు. ఈ నెల 7న వీరి వద్దకు ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి బంగారానికి మెరుగు పెడతామని నమ్మబలికారు. తొలుత రాగి చెంబుకు, తర్వాత భవానీ శంకరం వేలున ఉన్న బంగారు ఉంగరానికి పౌడర్‌తో మెరుగుపెట్టి అవి తళతళ మెరిసేలా చూపించారు. అవన్నీ నిజమని నమ్మిన ఆ దంపతులు 41 గ్రాముల బంగారు ఆభరణాలు ఇచ్చారు. వాటిని కుక్కర్లో వేసి పసుపు వేసినట్టు నటించి వారిని ఏమార్చి బంగారంతో ఆ ఇద్దరూ ఉడాయించారు. దీనిని గుర్తించిన దంపతులు లబోదిబోమంటూ ముమ్మిడివరం పోలీసులను ఆశ్రయించారు. వారు వచ్చీ రాని తెలుగులో తెలంగాణ యాసతో మాట్లాడారని వృద్ధ దంపతులు తెలిపారు. మహారాష్ట్ర లేదా బిహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తులుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ ఆగంతుల ఆచూకీ తెలిసిన వారు తక్షణమే ముమ్మిడివరం సీఐ ఎన్.కొండయ్య 94407 96564, ముమ్మిడివరం ఎస్సై కె.సురేష్‌బాబు 94407 96528 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ అంబికా ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. దర్యాప్తులో భాగంగా ఆ ఇంటి సమీపంలో ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించగా 30–40 సంవత్సరాల వయసు గల ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.



సీసీ ఫుటేజీల్లో రికార్డు అయిన బంగారం మెరుగు మోసగాళ్లు

ఏపీఎల్‌ను విజయవంతం చేయండి



3కే రన్‌లో క్రికెట్ సంఘ సభ్యులు, క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16, 17 తేదీలలో విశాఖలోని డాక్టర్ వైఎస్సార్ రెడ్డి క్రికెట్ మైదానంలో నిర్వహించే ఏపీఎల్ (ఆంధ్రా క్రికెట్ లీగ్)ను విజయవంతం చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్షుడు డాక్టర్ శివకుమార్ కోరారు. ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్–2 క్రికెట్ టోర్నీ సందర్భంగా 3కే రన్ నిర్వహించారు. దీనిని అధ్యక్షుడు శివకుమార్ స్థానిక ఆర్ఎంసీ క్రీడా మైదానంలో ప్రారంభించారు. క్రీడా మైదానం నుంచి భానుగుడి వరకూ రన్ సాగింది. కార్యక్రమంలో క్రికెట్ సంఘ సభ్యులు, క్రికెటర్లు పాల్గొన్నారు.

ఆ రైళ్లకూ హాల్టులు ఇవ్వండి



రైల్వే మంత్రికి ప్రతిపాదనలు అందిస్తున్న ఎంపీ గీత

కాకినాడ: ప్రయాణికుల సౌకర్యార్థం జిల్లా పరిధిలో ముఖ్యమైన కొన్ని రైళ్లకు హాల్టులు ఇవ్వాలని ఎంపీ వంగా గీత కోరారు. ఈ మేరకు రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను ఢిల్లీలో ఆదివారం కలిసి, ప్రతిపాదనలు సమర్పించారు. తునిలో నిజాముద్దీన్, స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్, అన్నవరంలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్, దుర్గాడలో సింహాద్రి, రాయగడ ఎక్స్‌ప్రెస్‌లు, పిఠాపురంలో జన్మభూమి, రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌లు, సామర్లకోటలో కోరమండల్ నిలుపు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కాకినాడ నుంచి వారణాశికి ప్రత్యేక రైలు ఏర్పాటు చేయాలని.. లేదా ప్రస్తుతం విశాఖ నుంచి నడుస్తున్న రైలును కాకినాడకు పొడిగించాలని కోరారు. కోవిడ్ సమయంలో నిలుపు చేసిన ప్యాసింజర్ రైళ్లను, జర్నలిస్టులు, సీనియర్ సిటిజన్ రాయితీలను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు సామర్లకోటలో హాల్ట్ ఇచ్చినందుకు, అమృత్ భారత్ పథకంలో తుని, కాకినాడ, సామర్లకోట రైల్వే స్టేషన్లను చేర్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడ – విశాఖ మధ్య మూడో లైన్ ఏర్పాటుకు సర్వే జరుగుతున్నందున.. దీనిని కాకినాడ సర్పవరం వద్ద అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అన్నవరం నుంచి ఎస్ఈజెడ్ పోర్టుకు కొత్తగా వేసే రైల్వే లైనును ఎన్ఎఫ్‌సీఎల్, కోరమండల్ ఫ్యాక్టరీలకు ఉన్న లైనుకు కలపాలన్నారు.

వినికిడి బాధితులకు ప్రభుత్వ సేవలు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాన్ఫరెన్స్ హాలులో ఆంధ్రప్రదేశ్ ఆడియోలజిస్టు అండ్ స్పీచ్ అసోసియేషన్ (ఏపీ ఏఎస్ఎల్‌పీఏ) ఆధ్వర్యంలో 'రీసెంట్ రీహేబిలిటేషన్ రీసెర్చ్' అనే అంశంపై రెండు రోజులుగా జరుగుతున్న సదస్సు ఆదివారంతో ముగిసింది. వినికిడి సమస్యతో బాధపడుతున్న వారు రాష్ట్రంలో సుమారు 10 లక్షల మంది వరకూ ఉన్నారని ఏపీ ఏఎస్ఎల్‌పీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపి వెంకటేష్ అన్నారు. ఈ సమస్యకు వయసుతో సంబంధం లేదని, వంశపారంపర్యంగా, అనారోగ్య కారణాలతో రావొచ్చన్నారు. బాధిత పిల్లలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నాయన్నారు. అసోసియేషన్ పరంగా పలు శిబిరాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కలిగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు హరికిషన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి సీహెచ్ భాస్కర్, నిర్వహణ కమిటీ చైర్మన్ త్రివిక్రమ్, సభ్యులు పాల్గొన్నారు.

తాగునీరు అనుకుని యాసిడ్ తాగిన బాలిక

- జీజీహెచ్‌లో అత్యవసర వైద్యం
- కోలుకుంటున్న బాధితురాలు

మధురపూడి: ఓ బాలిక తాగునీరు అనుకుని యాసిడ్ తాగిన ఘటన శనివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కోరుకొండ మండలం నర్సాపురం గ్రామానికి చెందిన ఎర్రమళ్ల లావణ్య నర్సాపురం హైస్కూల్‌లో ఆరో తరగతి చదువుతోంది. శనివారం రాత్రి ఆమె తన ఇంటి వద్ద ఉండగా కరెంట్ పోయింది. ఈ నేపథ్యంలో తాగునీరు అనుకుని బాత్‌రూమ్‌లు శుభ్రం చేసే యాసిడ్ తాగింది. సర్వేయర్‌కు సహాయకుడిగా పనిచేస్తున్న తన తండ్రి సత్తిబాబు ఆ యాసిడ్‌ను శనివారం ఇంటికి తీసుకొచ్చారు. కాగా దానిని బాత్‌రూమ్‌లో కాకుండా ఇంట్లో ఉంచారు. కరెంటు లేకపోవడంతో లావణ్య మంచినీటి బాటిల్ అనుకుని యాసిడ్ తాగింది. కడుపు మంట వస్తోందని అనడంతో యాసిడ్ బాటిల్‌ను గుర్తించిన తల్లిదండ్రులు స్థానికుల సహాయంతో హుటాహుటిన ఆటోలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కణుపూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఈ విషయం తెలుసుకుని రాజమహేంద్రవరం వెళ్లి లావణ్యను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు తెలిపారు. దీంతో మెరుగైన వైద్యం నిమిత్తం ఆమెను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ లావణ్య కోలుకుంటుందని బంధువులు తెలిపారు.



రాజమహేంద్రవరంలో చికిత్స పొందుతున్న లావణ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ముగిసిన 'ఈశా' వాలీబాల్ పోటీలు

విజేతగా నడకుదురు జట్టు

కాజులూరు: ఈశా ఫౌండేషన్ గ్రామీణ క్రీడా గ్రామోత్సవాల్లో భాగంగా గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్ మైదానంలో రెండు రోజులు నిర్వహించిన వాలీబాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఇందులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని పలు మండలాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. వీరిని 40 జట్లుగా విభజించి పోటీలు నిర్వహించగా కరప మండలం నడకుదురు జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. పెదపూడి మండలం రామేశ్వరం ద్వితీయ, అంబాజీపేట మండలం ముంగండ జట్టు తృతీయ, తాళ్లరేవు మండలం పెద్దవలస జట్టు నాలుగో స్థానం దక్కించుకుంది. విజేతలకు ఏపీ వాలీబాల్ అసోసియేషన్ రిఫరీ స్పోర్ట్స్ కన్వీనర్ లంకా జార్జ్, గ్రామ సర్పంచ్ పోతురాజు ప్రసన్న మౌనిక, వైఎస్సార్ సీపీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు తదితరులు నగదు బహుమతితో పాటు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లు సెప్టెంబర్ 5, 6వ తేదీలలో విజయవాడలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని ఈశా ఫౌండేషన్ కాకినాడ జిల్లా సమన్వయకర్త నరాల సాగర్, సంస్థ ఏరియా కోఆర్డినేటర్ కాయల నరసింహమూర్తి తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్లు సత్తి శ్రీరామారెడ్డి, గండి కిశోర్, స్కూల్ హెచ్‌ఎం సుశీలామణి తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ విజేతలకు నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న నాయకులు, అధికారులు

కిటకిటలాడిన రత్నగిరి

అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరి ఆదివారం కిటకిటలాడింది. స్వామివారిని సుమారు 40 వేల మంది దర్శించి, పూజలు చేశారు. వ్రతాలు 2,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. అన్నదాన పథకంలో 4 వేల మందికి భోజనం పెట్టారు. రూ.2 వేల వ్రత మండపంలో ఏసీలు పని చేయక వ్రతాలాచరించిన భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఒక దశలో అక్కడి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిత్య కల్యాణంలో కానుకలకు రశీదు తప్పనిసరి

అన్నవరం: సత్యదేవుని నిత్య కల్యాణంలో భక్తులు సమర్పించే కట్న కానుకలు, నూతన వస్త్రాలకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని అన్నవరం దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ ఆదివారం ఆదేశించారు. ఈ వివరాలను విధిగా రికార్డులో నమోదు చేయాలని స్పష్టం చేశారు. రూ.500 లోపు కట్నకానుకలను వేద పండితులు స్వామివారి హుండీలో వేయాలని పేర్కొన్నారు. కానుకలు సమర్పించే భక్తుల పేర్లు, గోత్రాలను విధిగా మైకులో చదవాలని ఆదేశించారు.

ప్లాస్టిక్ వాటర్ బాటిల్ ఉంటే జరిమానా

దేవస్థానంలో ఈ నెల 15వ తేదీ నుంచి అమలులోకి తీసుకువస్తున్న ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ వాడకం నిషేధం అమలుకు అధికారులు కృషి చేయాలని ఈఓ ఆదేశించారు. తమ వద్ద ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ లేవని అన్ని షాపుల యజమానుల నుంచి 14వ తేదీ సాయంత్రానికల్లా ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలన్నారు. భక్తులు కేవలం సీలు విప్పని కూల్‌డ్రింక్ బాటిల్స్ మినహా ఇతర ప్లాస్టిక్ బాటిల్స్ రత్నగిరికి తీసుకు రాకుండా టోల్‌గేట్, మెట్ల దారి వద్ద తనిఖీలు చేయాలని సూచించారు. ఎవరి వద్ద అయినా ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, గ్లాసులు ఉంటే రూ.500 జరిమానా విధించాలని ఆదేశించారు.